


# పరకాంత

ఇల్లిందల సరస్వతీదేవి

వరదరాజేశ్వరి ఆ క్రిందటి రోజే జూనియర్ కాలేజికి లెక్చరర్‌గా బదిలీ అయివచ్చింది.

ఆమె రిజిస్టర్‌లో సంతకం పెట్టే ముందు మెడనొకసారి తడిమి చూసుకుంది. బంగారంతో చుట్టిన రెండు వరుసల నల్లపూసలదండ ఒక పేట బంగారు గొలుసు చేతికి తగిలాయి. మెడనిండుగా ఉంది. వాటి నొకసారి కంటితో చూసుకోగానే ధైర్యం వచ్చినట్లయింది. సంతకం పెట్టి హుందాగా స్టాఫ్‌రూంలోకి వెళ్లి కూర్చుంది. టైం టేబుల్ చూసుకుంది. పది గంటల తరువాత తనక్లాసు.

ఈ లోపల ఒక్కొక్కరే ఆ రూములోకి వస్తున్నారు. వచ్చి- కుర్చీలో కూర్చున్న వరదరాజేశ్వరిని చూసి "కొత్తగా వచ్చారా?" అని అడుగుతున్నారు.

"అవును. నిన్ననే వచ్చాను" చెబుతోంది.

నాలుగయిదు రోజులయేసరికల్లా ఆ కాలేజిలో పనిచేస్తున్న ఉపన్యాసకురాండ్రకు ఆమె మెడలోఉన్న ఆ రెండు హారాల సంగతీ తెలిసిపోయింది. పలకరింపుల తరువాత సంభాషణలలోకి దిగారు. క్రమంగా చనువు ఏర్పడ్డది.

మాలిక, అర్చన ఇద్దరూ చాలా చురుకుగా ఉంటారు. వాళ్ల చురుకుదనం కళ్లల్లోనే కాదు మాటల్లోకూడా ప్రస్ఫుటమవుతుంది. హాస్యంగా- వ్యంగ్యంగా చమత్కారంగా మాట్లాడుతూ ఎదట మనిషిని తికమకపెట్టేస్తారు. ఈ ఇద్దరికంటె కొంచెం వయస్సులో పెద్దవాళ్లు రమణీ, శాంతా మితంగా తూచి తూచి మాట్లాడతారు. వాళ్ల వాళ్ల సబ్జక్ట్సులో గట్టివాళ్లే. విద్యార్థులకు బాగా పాఠాలు చెప్పి వాళ్లనాకర్షిస్తారు. తమ డ్యూటీని

